క్లుప్తంగా

కరాటే విజేతకు సత్కారం



కరాటే విజేత ప్రణుతిని అభినందిస్తున్న ఉప సర్పంచ్, గ్రామ పెద్దలు

సామర్లకోట: ఇటీవల విశాఖపట్నంలో జరిగిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో హుస్సేన్‌పురం గ్రామానికి చెందిన ముప్పిడి ప్రణుతి అండర్-12 విభాగంలో బంగారు పతకం సాధించింది. దాంతో ఆ గ్రామ ఉప సర్పంచ్ యవర్న చంద్ర శేఖర్ ఆధ్వర్యంలో బాలికను అభినందించారు. సామర్లకోటలో కరాటే కోచ్ శంకర్ వద్ద ఆమె శిక్షణ తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. రోజూ ఉదయం కరాటే శిక్షణకు మూడు కిలో మీటర్లు వెళ్లి నేర్చుకోవడంతో తగిన ఫలితం దక్కిందని చంద్రశేఖర్ తెలిపారు. వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ మండల కన్వీనర్ అచ్చారావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

మధ్యలోనే వదిలేశారు



సీతారామ కాలనీలో రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభం

సామర్లకోట: విద్యుత్తు శాఖ నిర్లక్ష్యం వాహనచోదకులకు ప్రాణసంకటంలా మారింది. స్థానిక రెండో వార్డు సీతారామ కాలనీ, ఇందిరాపార్కు రోడ్డు మధ్యలో విద్యుత్ స్తంభం ఉంది. దీనిని గమనించక చాలామంది ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ స్తంభాన్ని మార్చు చేయాలని అనేక పర్యాయాలు అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని ఆ వార్డు కౌన్సిలర్ పాలిక కుసుమ అన్నారు. నిబంధనల ప్రకారం రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ సంభాన్ని ఎటువంటి ఫీజులు చెల్లించకుండా మార్చాలని, అయినా మార్చడం లేదని వైఎస్సార్ సీపీ నాయకుడు పాలిక చంటిబాబు అన్నారు. దీనిపై శుక్రవారం జరిగే కౌన్సిల్ సమావేశంలో చర్చించి, తీర్మానం చేసి ట్రాన్స్‌కో అధికారులకు పంపేలా చర్యలు తీసుకుంటామని కుసుమ చెప్పారు.

ఎస్పీ బాలు గానం సజీవం



ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న స్మారక కళావేదిక సభ్యులు

బోట్‌క్లబ్: సినీ గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం సజీవంగా లేకున్నా, ఆయన పాటలు చిరస్థాయిగా నిలిచిపోయాయని ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం స్మారక కళావేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు దోకుబుర్ర రామరాజు అన్నారు. స్థానిక దంటు కళాక్షేత్రంలో గురువారం కళావేదిక ఆధ్వర్యంలో ఎస్పీ బాలు వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. బాలు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఆయన పాట వినిపించని ఇళ్లు ఉండదన్నారు. అటువంటి గాయకుడు లేకపోవడం సినీ లోకానికి తీరని లోటన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వేదిక సభ్యులు ఇబ్రాయిల్, సీహెచ్ ధర్మారావు, సాల్మన్‌రాజు, ఎం.రామారావు, వీరభద్రరావు పాల్గొన్నారు.

అతలాకోతలం..

- వీకే రాయపురంలో కోతకు గురైన కాజ్‌వే
- రైతుల రాకపోకలకు అంతరాయం



వీకే రాయపురం వద్ద ఏలేరు కాలువలో కోతకు గురైన కాజ్‌వే

సామర్లకోట: సామర్లకోట మండలం వీకే రాయపురం గ్రామంలో ఏలేరు కాలువలో నిర్మించిన కాజ్‌వే కోతకు గురైంది. పది రోజుల పాటు కురిసిన వర్షాలకు ఏలేరు కాలువ ఉధృతంగా ప్రవహించింది. ఈ కాలువలో పెరిగిన గుర్రపుడెక్క కాజ్‌వే మీదుగా వెళ్లడంతో కోతకు గురైంది. రైతుల రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. కాజ్‌వే నిర్మించిన తరువాత ఇప్పటి వరకూ సుమారు ఆరు పర్యాయాలు కోతకు గురవడంతో తాత్కాలిక మరమ్మతులు చేయించి అధికారులు చేతులు దులుపుకొన్నారు. రైతు సంఘం నుంచి రెండు పర్యాయాలు, జిల్లా కలెక్టరు నిధులతో నాలుగు పర్యాయాలు మరమ్మతులు చేసి సుమారు రూ.30 లక్షల వరకూ ఖర్చు చేశారు. ఆ ఖర్చు బూడిదలో పోసిన పన్నీరుగా మారింది. ఏలేరు కాలువలో నీటి ప్రవాహంతో పాటు గుర్రపుడెక్క ఎక్కువగా ఉండటం వల్ల కాజ్‌వే తూరలకు చిక్కుకుని నీటి ప్రవాహానికి తూరలను పైకి లేపేస్తున్నాయి. ఏలేరు కాలువ అవతలి వైపు వీకే రాయపురంతో పాటు సామర్లకోట, బోయనపూడి గ్రామాలకు చెందిన సుమారు ఐదు వేల ఎకరాల పంట భూములు ఉన్నాయి. ఇప్పటికే వీకే రాయపురానికి చెందిన రైతుల పంట పొలాలు పూర్తిగా నీటిలో మునిగిపోవడంతో నీరు తగ్గిన తరువాత తిరిగి వరి నాట్లు వేసుకున్నారు. ఏలేరు కాలువ అవతలి వైపు వీకే రాయపురం శివారు ప్రాంతమైన సత్యవరపుపేట ఉంది. ఆ ప్రాంతంలో సుమారు 150 కుటుంబాల వరకూ నివాసం ఉంటున్నారు. ఇక్కడ ఇళ్ల నిర్మాణానికి మెటీరియల్ కాజ్‌వే ద్వారా తీసుకురావడం జరుగుతుంది. అయితే కాజ్‌వే కోతకు గురవడంతో మెటీరియల్ తీసుకురావడానికి అంతరాయం ఏర్పడుతుందని ఆ ప్రాంత ఎంపీటీసీ సభ్యుడు శివకోటి శివరామకృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో చినరాజప్ప ఉప ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో వంతెన నిర్మాణానికి హామీ ఇచ్చారు. **అయితే** ఇప్పటి వరకూ దానిపై ఎటువంటి కదలిక లేదు.



కాలిబాట వంతెనపై విరిగిపోయిన రెయిలింగ్

పొంచి ఉన్న ప్రమాదం

వరి కోతలకు మరో రెండు నెలల సమయం ఉంది. కాజ్‌వే కూలిపోవడంతో దానికి ప్రత్యామ్నాయంగా కాలిబాట వంతెన ఉండటంతో రైతులు సైకిళ్లపై తమ పొలాలకు వెళ్తున్నారు. సత్యవరపుపేటకు చెందిన వారు ఇళ్ల నిర్మాణానికి తెచ్చిన మెటీరియల్‌ను కాలిబాట వంతెన మీదుగా కూలీలతో తీసుకు రావాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. అదే విధంగా సత్యవరపుపేటకు చెందిన వారి పిల్లలు ప్రధాన గ్రామంలో ఉన్న హైస్కూల్‌కు కాలిబాట వంతెన మీదుగా రాకపోకలు సాగిస్తున్నారు. ఈ వంతెనకు రెయిలింగ్ విరిగిపోవడంతో పిల్లలు పరుగులు తీసే సమయంలో ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మరమ్మతులతో సరి



రైతులు తమ పొలాలకు వెళ్లడానికి కాజ్‌వే సమీపంలో ఉన్న కాలిబాట వంతెన మీదుగా రాకపోకలు సాగిస్తుంటారు. ప్రస్తుతం పొలాలకు ట్రాక్టర్లు తీసుకువెళ్లే పని లేదు. మరో రెండు నెలల్లో వరి కోతల దశ పూర్తయితే ధాన్యం తీసుకు రావడానికి కాజ్‌వే రైతులకు గుర్తుకు వస్తుంది. కాజ్‌వే కోతకు గురై సుమారు 20 రోజులు గడిచినా ఇప్పటి వరకు రైతు సంఘ ప్రతినిధులు గాని, అధికారులు గాని పట్టించుకోలేదు.

–ఇంటి వెంకట్రావు, రైతు, వీకే రాయపురం

వంతెన నిర్మాణమే శరణ్యం



రైతు సమస్యల శాశ్వత పరిష్కారానికి వంతెన నిర్మాణం ఒక్కటే మార్గం. గతంలో డిప్యూటీ సీఎంగా ఉన్న చినరాజప్ప వంతెన నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటి వరకూ ప్రతిపాదనలు తీసుకురాలేదు. సామర్లకోట, వీకే రాయపురం, బోయనపూడి గ్రామాలకు చెందిన రైతుల భూములు ఏలేరు కాలువ అవతలి వైపు ఉన్నాయి. 216 జాతీయ రహదారి పనులలో భాగంగా ఏలేరు కాలువపై ముత్యాలమ్మ ఆలయం సమీపంలో నిర్మాణం అవుతున్న వంతెన వల్ల గ్రామంలోని రైతులకు ఎటువంటి ప్రయోజనం ఉండదు.

–తలారి దొరబాబు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు, వీకే రాయపురం

సర్పంచులు, కార్యదర్శులకు శిక్షణ

సామర్లకోట: స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో 26, 27 తేదీల్లో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ ఉంటుందని ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎం.భైరవమూర్తి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర పంచాయతీరాజ్ అండ్ గ్రామీణాభివృద్ధి సంస్థ కమిషనర్ ఉత్తర్వుల మేరకు ఈ శిక్షణ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గ్రామ పంచాయతీలు ఆర్థిక వనరులను ఏర్పాటు చేసుకునే విధంగా ఈ శిక్షణ ఉంటుందన్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ రెండు రోజుల పాటు నిర్వహించే ఈ శిక్షణకు సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు హాజరు కావాలన్నారు.

గ్రామాల్లో వైద్య శిబిరాలు

కొత్తపల్లి: మండలంలోని కొత్తపల్లి, నాగులాపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో ఉప్పాడ సచివాలయం-4, శ్రీరాంపురం గ్రామాల్లో గురువారం స్వస్త్ నారీ- సశక్త్ అభియాన్ పరివార్ శిబిరాలు నిర్వహించారు. వైద్యాధికారులు సుష్మ, సౌజన్యలు 250 మందికి వైద్య పరీక్షలు చేశారు. గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కిశోర్ బాలికలకు పలు పరీక్షలు నిర్వహించారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

సామర్లకోట: పనసపాడు గ్రామంలో శుక్రవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తామని ఆ గ్రామ సర్పంచ్ చీకట్ల వెంకటేష్ గురువారం తెలిపారు. వాసన్ కంటి ఆసుపత్రిచే వైద్య పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఈ అవకాశాన్ని కంటి లోపాలు ఉన్నవారు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పాత పంచాయతీ కార్యాలయం వద్ద ఉదయం 9 గంటల నుంచి శిబిరం ప్రారంభమవుతుందని చెప్పారు.

చెత్తశుద్ధి ఇదేనా!

సామర్లకోట: స్వచ్ఛత పక్షోత్సవాలను అధికారులు, ప్రజాప్రతినిధులు అట్టహాసంగా నిర్వహిస్తున్నారు. అయితే స్థానిక తహసీల్దార్, ఐసీడీఎస్ కార్యాలయాల వెనుక భాగంలో కంపోస్టు యార్డులా చెత్త పేరుకుపోయినా పట్టించుకునేవారే కరవయ్యారు. ప్రభుత్వ కార్యాలయాల వెనుక చెత్త, తుప్పలు పెరిగిపోయాయి. దీంతో సమీపంలోని తమ ఇళ్లలోకి విష సర్పాలు వస్తున్నాయని, ఆ ప్రాంత వాసి వీసం వీరనాగు అన్నారు. ఒకవైపు అల్లూరి సీతారామరాజు పార్కు, మరో వైపు ప్రభుత్వ కార్యాలయాల మధ్యలో చెత్త పెరిగినా పట్టించుకోవడం లేదు. స్వచ్ఛతపై అధికారులు



తహసీల్దార్, ఐసీడీఎస్ కార్యాలయాల వెనుక పెరిగిన చెత్త, తుప్పలు

ప్రచారం చేస్తుండగా, వారి కార్యాలయాల వద్దే చెత్త పేరుకుపోవడం శోచనీయం.

న్యాయవాదుల సమస్యలు పరిష్కరించాలి



పెద్దాపురం బార్ అసోసియేషన్ వద్ద నిరసన తెలియజేస్తున్న న్యాయవాదులు

పెద్దాపురం: న్యాయవాదుల సమస్యలు పరిష్కరించాలని ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు) ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం పెద్దాపురం బార్ అసోసియేషన్ న్యాయవాదులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఐలు జిల్లా ప్రధాన కార్యదర్శి గదిమెళ్ల శ్రీభాస్కరాచార్యులు మాట్లాడుతూ గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో లా నేస్తం పేరుతో జూనియర్ న్యాయవాదులకు శిక్షణ భృతి (స్టైఫండ్) రూ.ఐదు వేలు ఇచ్చేవారని, జూనియర్ న్యాయవాదులకు వృత్తిలో నిలదొక్కుకునేందుకు ఇది ఎంతగానో ఉపయోగపడేదన్నారు. యువగళం పాదయాత్రలో లోకేష్ పిఠాపురం బహిరంగ సభలో తాము అధికారంలోకి వస్తే న్యాయవాదులకు ప్రత్యేక సంక్షేమ నిధి ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారన్నారు. సాధారణ ఎన్నికల సమయంలో సీఎం చంద్రబాబు విజయవాడలో ఏర్పాటు చేసిన సమావేశంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే న్యాయవాదులకు న్యాయమిత్ర పథకం కింద నెలకు రూ.ఐదు వేల నుంచి రూ.పది వేల భృతి ఇస్తానని హామీ ఇచ్చారన్నారు. న్యాయమిత్ర పథకం లబ్ధిదారుల సంఖ్య 2,670 నుంచి 3,500కు పెంచుతామని, రూ.వంద కోట్లతో న్యాయవాదులకు కార్పస్ ఫండ్ ఏర్పాటు చేసి ఆర్థికంగా తోడ్పాటునందిస్తామని, ప్రతి న్యాయవాదికి రూ.ఐదు లక్షల ఆరోగ్య బీమా, రూ.15 లక్షల ప్రమాద బీమాతో పాటు ఇళ్ల స్థలాలు కేటాయిస్తామని హామీ ఇచ్చిన సంగతి కూటమి ప్రభుత్వం పక్కన పెట్టిందన్నారు. అధికారం చేపట్టి 15 నెలలు కావొస్తున్నా ఇచ్చిన హామీల అమలు ఊసే లేదన్నారు. న్యాయవాదులకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లోని బార్ అసోసియేషన్ల వద్ద న్యాయవాదులతో సంతకాల సేకరణ, కరపత్రాల పంపిణీ చేపట్టి నిరసన కార్యక్రమాలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఐలు పెద్దాపురం సభ్యులు ఎస్‌కే వలీబాబు, గణేష్, సీనియర్ న్యాయవాదులు కొట్టేటి వెంకటరాయుడు, పి.దొరబ్బాయి, జైన్, శ్రీనివాస్, ఎంకే మొహిద్దీన్, నరసింహారావు, బొండు ప్రసాద్, టి.సూకరాజు, ఎం.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛతకు కృషి చేద్దాం

సామర్లకోట: స్వచ్ఛ మున్సిపాలిటీకి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మున్సిపల్ ఇన్‌చార్జి చైర్‌పర్సన్ గోకిన సునేత్రాదేవి, కమిషనర్ ఎ.శ్రీదేవి అన్నారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా స్థానిక రెండో వార్డు సీతారామకాలనీ ఇందిరా పార్కులో నిర్వహించిన శ్రమదానాన్ని గురువారం వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ స్వచ్ఛతపై అవగాహన పెంచుకోవాలన్నారు. పరిసరాలను శుభ్రంగా ఉంచడం ద్వారా రోగాలను నివారించడానికి అవకాశం ఉంటుందన్నారు. క్లీన్ ఆంధ్రప్రదేశ్‌లో భాగంగా చెత్త రహిత పట్టణం రూపకల్పనకు శ్రమదానం చేయడానికి ముందుకు రావాలన్నారు. ఈ మేరకు పార్కులో కమిషనర్ స్వచ్ఛతపై ప్రతిజ్ఞ చేయించారు. ఈతలో గిన్నిస్ బుక్ రికార్డు సాధించిన గోలి శ్యామల, కౌన్సిలర్లు పాలిక కుసుమ, బలుసు వాసు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత తోట కూర సాయిరామకృష్ణ, మాజీ కౌన్సిలర్లు అడబాల కుమారస్వామి, బడుగు శ్రీకాంత్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్ పాల్గొన్నారు.



సామర్లకోటలో రైల్వే స్టేషన్ ఆవరణను శుభ్రం చేస్తున్న మేనేజర్ రమేష్ తదితరులు

ప్లాస్టిక్ భూతాన్ని తరిమేద్దాం

సామర్లకోట: స్థానిక రైల్వే స్టేషన్ నుంచి ప్లాస్టిక్ భూతాన్ని తరిమేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని స్టేషన్ మేనేజర్ ఎం.రమేష్ పిలుపునిచ్చారు. స్థానిక రైల్వే స్టేషన్‌లో స్వచ్ఛతా హీ సేవా పక్షోత్సవాల్లో భాగంగా స్టేషన్ ఆవరణలో చెత్తను గురువారం శుభ్రం చేశారు. తొలుత రైల్వే ఉద్యోగులు, సిబ్బంది, ప్రయాణికులతో స్వచ్ఛ ప్రతిజ్ఞ చేయించారు. అక్టోబర్ 2 నుంచి రైల్వే స్టేషన్ ఆవరణలో పూర్తిగా ప్లాస్టిక్ నిషేధం అమలులోకి వస్తుందన్నారు. అప్పటి వరకూ రోజూ ప్రజలు, ప్రయాణికులను చైతన్యం చేస్తామని అన్నారు. ఈ మేరకు రైల్వే స్టేషన్‌లో స్వచ్ఛతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. చీఫ్ హెల్త్ ఇన్‌స్పెక్టర్ కల్యాణి తదితరులు పాల్గొన్నారు.



సామర్లకోట పార్కులో స్వచ్ఛతా హీ సేవ ప్రతిజ్ఞ చేయిస్తున్న కమిషనర్ శ్రీదేవి

బార్ అసోసియేషన్‌కు గుర్తింపు తేవాలి

కాకినాడ లీగల్: న్యాయవాదుల క్రికెట్ పోటీల్లో స్థానిక బార్ అసోసియేషన్‌కు జాతీయ స్థాయి గుర్తింపు తీసుకురావాలని బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఏలూరి సుబ్రహ్మణ్యం, చెక్కపల్లి వీరభద్రరావు (చంటి) కోరారు. నవ్యాంధ్ర అడ్వకేట్ క్రికెట్ అసోసియేషన్ (ఎన్ఏఏసీఏ) ఆధ్వర్యంలో ఈ నెల 27 నుంచి ఢిల్లీలో జరిగే ఆల్ ఇండియా అడ్వకేట్స్ 20-20 క్రికెట్ టోర్నమెంట్లో ఆంధ్రప్రదేశ్ జట్టు కెప్టెన్‌గా కాకినాడ బార్ అసోసియేషన్ న్యాయవాది దొంతుమళ్ల అశోక్‌కుమార్, అలాగే మరో న్యాయవాది గింజాల చక్రవర్తికి చోటు దక్కింది. వీరిని గురువారం బార్ అసోసియేషన్ హాలులో సత్కరించారు. ఢిల్లీలో జరగబోయే 20-20 క్రికెట్ టోర్నమెంట్‌లో న్యాయవాదులు అశోక్‌కుమార్, చక్రవర్తి తమ సత్తా చాటి కాకినాడకు మంచి పేరు తేవాలని అధ్యక్షుడు ఏలూరు సుబ్రహ్మణ్యం, కమిటీ సభ్యులు కోరారు. ఆ ఇద్దరు న్యాయవాదులను రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు నరహరిశెట్టి రవికృష్ణ, న్యాయవాదులు అభినందించారు.

ఎరువుల యాజమాన్యంతో అధిక దిగుబడులు

కరప: వరి సాగులో ఎరువుల యాజమాన్య పద్ధతులు అనుసరిస్తే, తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించవచ్చని ఎంఏఓ ఇమ్మిడిశెట్టి సత్య అన్నారు. గురువారం కొంగోడులో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సత్య మాట్లాడుతూ ఎరువుల యాజమాన్య పద్ధతులు, శత్రు, మిత్ర పురుగుల గురించి వివరించారు. సూటి ఎరువులైన నత్రజని, భాస్వరం, పొటాష్ ఎరువులను అవసరం మేరకే వాడాలన్నారు. వీటితో పాటు సూక్ష్మ ధాతువు ఎరువులైన జింక్, బోరాన్, ఐరన్, మెగ్నీషియాన్ని అవసరానికి అనుగుణంగా వినియోగిస్తే సాగు ఖర్చును తగ్గించుకోవచ్చన్నారు. మొక్క అవసరాలను గుర్తించి సరైన మోతాదులో ఎరువులు అందిస్తే మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు. తర్వాత రైతులను పొలాల్లోకి తీసుకెళ్లి శత్రు, మిత్ర పురుగుల గురించి అవగాహన కల్పించారు. పొలాల్లో ఉండే మిత్ర పురుగులైన తూనీగలు, మిడతలు, కందిరీగలు, అక్షింతల పురుగులు, బిళ్ల పురుగులు, సాలీడు, నీటి నల్లులు గుర్తించి, అవిచేసే మేలును తెలిపారు. శత్రు పురుగులైన వరి ఈగలు, పచ్చదోమలు, ఆకుచుట్టు పురుగులు, కాండం తొలుచు పురుగులు, ఉల్లికోడు, రెల్లరాల్చు పురుగులు, సుడిదోమలు గురించి తెలిపి, వాటివల్ల కలిగే అనర్థాలను వివరించారు. వ్యవసాయ విస్తరణాధికారులు ఎంవీ సతీష్, బండారు శ్రీరాములు, వీఏఏలు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

దేవాలయాల పరిరక్షణ చర్యలు అవసరం

బోట్‌క్లబ్: హిందూ దేవాలయాల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు ఆర్.రవిశంకర్ పట్నాయక్ అన్నారు. స్థానిక గాంధీనగర్ ఓలేటివారి వీధిలో గురువారం పరిషత్ కాకినాడ జిల్లా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా హైందవ శంఖారావ సభ డిక్లరేషన్, హైందవ శంఖారావ సంకల్ప ప్రతిజ్ఞ చేయించారు. శంకర, రామానుజ, మధ్వ ఆచార్య వంటి పూజ్య ధర్మాచార్యులు అందించిన సనాతన ధార్మిక మార్గంలో అందరూ నడవాలన్నారు. హిందూ ధర్మంపై ఏవిధమైన దాడులు జరిగినా తక్షణం స్పందిస్తూ ఉండాలని, హిందూ దేవాలయాల రక్షణ, స్వయం ప్రతిపత్తి కోసం జరుగుతున్న జాతీయ మహోద్యమంలో భాగస్వాములు కావాలన్నారు. సంస్కృత ప్రచార ప్రముఖ్ చల్లా శ్రీకృష్ణవాణి మాట్లాడుతూ భగవద్గీత పోటీలు నవంబర్ నుంచి జరుగుతాయని, పాఠశాల, కళాశాలల విద్యార్థులు, మహిళలు, పురుషులు కూడా పాల్గొనవచ్చన్నారు.

దుష్టసంహారిణి.. శిష్ట శుభకరిణి



సామర్లకోట పంచారామ క్షేత్రంలో లలితాదేవి రూపంలో అమ్మవారు



కొమరగిరిలో అన్నపూర్ణాదేవిగా..



కొత్తపల్లి కనకదుర్గాదేవి ఆలయంలో..



కాండ్రకోట నూకాలమ్మ ఆలయంలో కాత్యాయనిగా..



పిఠాపురం పాదగయలో గాయత్రీదేవిగా రాజరాజేశ్వరీదేవి



కూష్మాండ అవతారంలో తాటిపర్తి అపర్ణాదేవి



మహేశ్వరి అవతారంలో పిఠాపురం మహాలక్ష్మి అమ్మవారు



హరిద్ర శృంగారార్చన అలంకారంలో దుర్గాడ లలితా మాత

- భక్తిశ్రద్ధలతో శరన్నవరాత్ర ఉత్సవాలు
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు

సామర్లకోట: శరన్నవరాత్ర ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి.. ఇందులో భాగంగా స్థానిక పంచారామ క్షేత్రంలో వేంచేసి ఉన్న స్వామివారి దేవేరి బాలాత్రిపుర సుందరీదేవి గురువారం లలితాదేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం స్వామివారికి ఏకాదశ రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. మహిషాసురమర్ధిని అమ్మవారి ఆలయం వద్ద గణపతి హోమం, రుద్రహోమం, సహస్ర చండీ హోమం నిర్వహించారు. అమ్మవారిని బంగారు కిరీటం, బంగారు ఆభరణాలతో, కుమారారామ భీమేశ్వరస్వామిని వెండి ఆభరణాలతో అలంకరించారు. ఈఓ భళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో ఆలయ పండితులు వేమూరి సోమేశ్వరశర్మ, అళ్లకి రాజ్‌గోపాల్‌శర్మ, సన్నిధిరాజు వెంకటరమణ, చెరుకూరి రాంబాబు, శ్రీకాకుళపు సత్యనారాయణమూర్తి, వినయ్‌లు పూజాధికాలు నిర్వహించారు.

పిఠాపురంలో..


పిఠాపురం: శరన్నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా నాల్గో రోజు పిఠాపురం పాదగయలో రాజరాజేశ్వరీదేవి అమ్మవారు గాయత్రీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అలాగే పదో శక్తి పీఠం పూరుహూతికా అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో అపర్ణాదేవిని కూష్మాండ అవతారంలో, దుర్గాడ శివాలయంలో లలితా మాత హరిద్ర శృంగారార్చన అలంకారంలో దర్శనమిచ్చారు. పిఠాపురం మహాలక్ష్మి అమ్మవారిని మహేశ్వరిగా అలంకరించారు.



సామర్లకోటలో చండీ హోమం చేస్తున్న పండితులు

కొత్తపల్లి: మండలంలోని అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. స్థానిక శ్రీధర్మశాస్త్రా ఆలయంలో కనకదుర్గమ్మ వారికి ఉదయం, సాయంత్రం ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు నిర్వహించారు. కొత్తపల్లి కనకదుర్గమ్మ ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. కుంకుమ పూజలు, సహస్ర నామార్చనలు, అభిషేకాలు చేశారు. కొమరగిరిలో శ్రీబాల కనకదుర్గాదేవి అన్నపూర్ణాదేవిగా దర్శనమిచ్చారు.

పెద్దాపురం: కాండ్రకోట నూకాలమ్మ, పెద్దాపురం మరిడమ్మ అమ్మవార్లు కాత్యాయనీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆయా ఆలయాల కార్యనిర్వహణాధికారులు రాంబాబురెడ్డి, విజయలక్ష్మి ఆధ్వర్యంలో అమ్మవార్లను అలంకరించారు. పెద్దాపురం వర్ధులవారి వీధిలోని శ్రీభువనేశ్వరీ పీఠంలో భువనేశ్వరి అమ్మవారు కాత్యాయిని అవతారంలో దర్శనమిచ్చారు. పీఠాధిపతి చింతా గోపిశర్మ సిద్ధాంతి ఆధ్వర్యంలో పీఠంలో మండపారాధన, అభిషేకాలు, సహస్ర కుంకుమ పూజ, నవచండీ పారాయణ తదితర పూజలు నిర్వహించారు.



సామర్లకోట పంచారామ క్షేత్రంలో కుమారారామ భీమేశ్వరస్వామి